సాక్షి
ఖమ్మం
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



రూ.11.35లక్షలు స్వాధీనం

ఎన్నికల సందర్భంగా వివిధ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఒకేరోజు రూ.11.35లక్షల నగదును సీజ్ చేశారు. 10లో



లీకేజీలకు కేరాఫ్‌గా...

టీఎస్‌పీఎస్సీ లీకేజీలకు కేరాఫ్‌గా మారి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమవుతోందని అఖిలపక్షం నేతలు విమర్శించారు. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 22°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం మంచు కురిసే అవకాశముంది. ఆతర్వాత ఎండ మొదలై క్రమంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బాలసానిని కలిసిన మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణను ఖమ్మంలోని ఆయన స్వగృహంలో శనివారం రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కలిశారు. కొద్దిరోజులుగా బాలసాని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు లేదంటూ ఆయన భద్రాచలం నియోజకవర్గానికి వెళ్లడం లేదు. దీంతో మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు ఖమ్మంలో ఆయనను కలవగా పార్టీలో జరిగిన అవమానాలను ఏకరువు పెట్టినట్లు తెలిసింది. పార్టీ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేసినా భద్రాచలం నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించడమేకాక తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని వివరించినట్లు సమాచారం.

జాతీయ స్థాయి టోర్నీ ఎంపైర్‌గా మల్లికార్జున్



మల్లికార్జున్

ఖమ్మం స్పోర్ట్స్: గోవాలో ఈనెల 19నుంచి జరగనున్న జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపైర్‌గా ఖమ్మంకు చెందిన టి.మల్లికార్జున్ ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ఆయన మాత్రమే ఎంపిక కావడం విశేషం. ఈసందర్భంగా మల్లికార్జున్‌ను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జి.వెంకట్రావు, అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని వెంకట్రావు, ఎస్.ఉప్పల్‌రెడ్డి, చంద్రశేఖర్ అభినందించారు.

రేపటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం మొదలుకానున్నాయి. ఈనెల 26వ తేదీ వరకు జరిగే పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా 862మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలకు 414 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు 448మంది హాజరవుతారు. అభ్యర్థులను గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తామని, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత అనుమతి ఉండదని డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్లు 80084 03522, 81424 06769 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత శ్రీవారి పాదంతోపాటు స్వామి మూల విరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను ప్రత్యేక అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీసేవ నిర్వహించగా, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏ విజయచంద్రకు రైతునేస్తం పురస్కారం



పురస్కారం అందిస్తున్న వెంకయ్యనాయుడు

కూసుమంచి: కూసుమంచి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఎస్.విజయచంద్ర రైతునేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. ముప్పవరపు ఫౌండేషన్, రైతునేస్తం సంయుక్తంగా ప్రకటించిన పురస్కారాన్ని హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్ర పతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అందజేశారు. 26ఏళ్లుగా రైతులకు చేస్తున్న కృషికి గాను ఏడీఏ పురస్కారానికి ఎంపికయ్యారు. కాగా, ఆయన రైతులకు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఏడీఏ స్వర్ణ విజయచంద్ర పేరుతో యూట్యూబ్ చానల్ కూడా నిర్వహిస్తుండడంతో పురస్కారదాతలు అభినందించారు.

ఒక్కేసి.. పువ్వేసి!



- మొదలైన పూల పండుగ
- జిల్లావ్యాప్తంగా బతుకమ్మ ఆడిపాడిన ఆడపడుచులు

ఆడపడుచులు ఘనంగా జరుపుకునే బతుకమ్మ పండుగ శనివారం మొదలైంది. జిల్లావ్యాప్తంగా ఆడపడుచులు ఉదయం నుంచే పూల సేకరణలో నిమగ్నం కాగా.. సాయంత్రానికి అందమైన ఆకృతుల్లోబతుకమ్మలను సిద్ధం చేశారు. అనంతరం కుటుంబీకులు, బంధువులు, స్నేహితులతో కలిసి సమీపంలోని ఆలయాలు, కాలనీల్లోని పార్కులకు చేరుకుని బతుకమ్మలను ఓ చోటకు చేర్చి కోలాటం ఆడుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరంగా గడిపారు. దీంతో ఎక్కడ చూసినా పండుగ సందడే కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్



ఇందిరానగర్ కాలనీలో బతుకమ్మల వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు



బుర్హాన్‌పురం హనుమాన్ ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ నిమజ్జనం చేస్తున్న యువతి



బతుకమ్మలతో యువతులు



బెర్త్‌లు ఖరారు..!

ఖమ్మంలో తుమ్మల.. పాలేరుకు పొంగులేటి

- కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్‌తో సస్పెన్స్‌కు తెర
- కే.సీ.వేణుగోపాల్ స్పష్టత ఇవ్వడంతో నరేనన్న మాజీ మంత్రి
- ఇప్పటికే మధిరలో భట్టి, భద్రాచలంలో వీరయ్య ఫైనల్
- తొలి జాబితాలోనే ఉమ్మడి జిల్లా నుంచి నలుగురి పేర్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) కసరత్తు తుది దశకు చేరింది. ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. పాలేరు నుంచి పొంగులేటి, ఖమ్మం నుంచి తుమ్మలను బరిలోకి దించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈమేరకు తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీలో శనివారం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్‌ను కలిశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పాలేరుతో ఉన్న అనుబంధం తెలిసినప్పటికీ పార్టీ బలోపేతానికి ఖమ్మం నుంచి బరిలో దింపాలని నిర్ణయించినట్లు చెప్పగా... అధిష్టానం నిర్ణయాన్ని పాటిస్తానని తుమ్మల బదులిచ్చారు. ఇక మధిర, భద్రాచలంలో సిట్టింగ్‌లైన సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, పొదెం వీరయ్యనే ఖరారు చేశారు. దీంతో నేడో, రేపో ప్రకటించే పార్టీ తొలి జాబితాలో ఉమ్మడి ఖమ్మం నుంచి నాలుగు స్థానాలకు స్థానం దక్కనుంది.

ఖమ్మంలో మూడోసారి తుమ్మల

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నుంచి బరిలో దిగనుండడం ఇది మూడోసారి అవుతుంది. ఆయన పాలేరు టికెట్ ఆశించినప్పటికీ సామాజిక సమీకరణాల నేపథ్యాన అధికార పార్టీకి దీటుగా ఖమ్మం నుంచే పోటీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌లో పాలేరు టికెట్ ఆశించి భంగపడిన ఆయన గత నెల 16న కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాలేరు టికెట్‌కు చివరి వరకు ప్రయత్నించినా ఖమ్మం నుంచి పోటీకే అధిష్టానం మొగ్గచూపింది. కాగా, సత్తుపల్లి ఎస్సీ రిజర్వ్ కావడంతో ఆయన 2009లో ఖమ్మం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచారు. ఆ తర్వాత 2014లో టీడీపీ నుంచే పోటీకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించినప్పటికీ 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఓటమి ఎదురైంది. ఇప్పుడు మూడోసారి ఖమ్మం నుంచి నాటి ప్రత్యర్థి పువ్వాడ అజయ్‌కు మార్క్‌పై మళ్లీ పోటీకి దిగుతున్నారు.

పాలేరు బరిలో పొంగులేటి

ఈ ఏడాది జనవరి 1న బీఆర్‌ఎస్‌పై నిరసన గళం విప్పిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. ఆతర్వాత పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. జూలై 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించి తన అనుచరులతో కలిసి రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్ గూటికి చేరారు. 2014లో పొంగులేటి వైఎస్సార్‌సీపీ తరఫున ఖమ్మం ఎంపీగా గెలుపొందిన ఆయన 2016లో పాలేరు ఉప ఎన్నిక సందర్భంగా అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో కలిసి చేరారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున నుంచి పార్లమెంట్ అభ్యర్థిత్వం ఆశించినా నిరాశ ఎదురైంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటి.. పాలేరు, ఖమ్మం, కొత్తగూడెంల్లో ఓ ఓచోట నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరిగినా... పాలేరులో అధికార పార్టీ అభ్యర్థి సామాజికవర్గ నేపథ్యం ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం అక్కడి నుంచే పోటీకి దింపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి పదిహేను రోజులుగా పాలేరులో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

ఆ రెండూ సిట్టింగ్‌లకే..

ఉమ్మడి జిల్లాలోని మధిరలో మల్లు భట్టి విక్రమార్క, భద్రాచలంలో పొదెం వీరయ్య ఎమ్మెల్యేలుగా కొనసాగుతుండగా.. మళ్లీ ఇప్పుడు కూడా వారి పేర్లనే ఖరారు చేసినట్లు సమాచారం. వామపక్షాలతో పొత్తుపై చర్చలు జరుగుతుండగా, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో ఆయా పార్టీలకు ఒకటి, రెండు స్థానాలను ఇస్తారనే ప్రచారం జరిగింది. గతంలో తాము ప్రాతినిధ్యం వహించిన భద్రాచలం, పాలేరు స్థానాలు ఇవ్వాలని సీపీఎం పట్టుబట్టినా పాలేరు నుంచి పొంగులేటి అభ్యర్థిత్వం ఖరారు కాగా.. భద్రాచలం సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ వదులుకోవడానికి సుముఖత చూపలేదని తెలిసింది. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యనే ఫైనల్ చేసినట్లు సమాచారం.

మిగతా స్థానాలపై ఉత్కంఠ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలకు గాను నాలుగు స్థానాల అభ్యర్థులను తొలి జాబితాలోనే కాంగ్రెస్ ప్రకటించనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు స్థానాల్లో సర్వేలు నివేదికలు, ఆశావహుల సత్తా ఆధారంగా కసరత్తు జరుగుతోంది. అయితే, ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న భట్టి, పొంగులేటి అనుచరులు ధీమాగా ఉన్నారు. కాగా, జనరల్ స్థానాలైన ఖమ్మం, పాలేరుల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు కాగా, కొత్తగూడెంపై మాత్రం సస్పెన్స్ వీడలేదు. ఇక్కడ బీసీ అభ్యర్థిని బరిలో దింపుతారా.. పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయిస్తారో తేలాల్సి ఉంది.

బీఆర్‌ఎస్‌లో కోలాహలం

నేడు బీ ఫామ్‌లు అందుకోనున్న అభ్యర్థులు

- నామినేషన్లు వేసేందుకు ముహూర్తాలు ఖరారు
- మేనిఫెస్టో ప్రకటించనుండడంతో సంబరాలకు సిద్ధం
- మరోసారి సీఎం సభల ఏర్పాట్లపై నిమగ్నం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్‌లో సందడి నెలకొంది. పార్టీ అభ్యర్థులను ప్రకటించి 54 రోజులు దాటుతుండగా.. ఇప్పటికే రెండేసి సార్లు అభ్యర్థులు నియోజకవర్గాలను చుట్టారు. ఇక పార్టీ అధినేత సీఎం కేసీఆర్ ఆదివారం బీ ఫామ్‌లు ఇవ్వనుండడంతో పది మంది అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లారు. అభ్యర్థులకు బీ ఫామ్‌లు ఇవ్వడమే కాక మేనిఫెస్టో ప్రకటించనుండటంతో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సంబరాలకు సన్నద్ధమయ్యాయి. అంతేకాక తొలివిడత సీఎం సభల షెడ్యూల్ కూడా ఖరారైనందున అభ్యర్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

మరింత ఉత్సాహం

ఉమ్మడి జిల్లాలో ఒకేసారి బీఆర్‌ఎస్ పది మంది అభ్యర్థులను ప్రకటించింది. సిట్టింగ్‌ల్లో వైరా మినహా పాత వారికే చోటు దక్కగా.. ఆనాటి నుంచి నియోజకవర్గాల్లో అసంతృప్తులను బుజ్జగించడం, ముఖ్య నేతలను సమన్వయం చేసుకుంటుండగా అధిష్టానం పర్యవేక్షించింది. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా అభ్యర్థులకు సూచనలు చేశారు. అసంతృప్తులను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని సర్దిచెప్పడంతో పలుచోట్ల అసమ్మతి చల్లారినా.. ఒకటి, రెండు చోట్ల మాత్రం కొనసాగుతోంది. ఇప్పుడు బీ ఫామ్ రానుండడంతో ప్రచారానికి మరింత పదును పెట్టడంతో పాటు నామినేషన్లు వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకుంటున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వచ్చేనెల 10న, లింగాల కమల్‌రాజ్ 9న నామినేషన్లు వేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.

మేనిఫెస్టో ప్రకటించగానే..

హైదరాబాద్‌లో ఆదివారం సీఎం కేసీఆర్ అభ్యర్థులకు బీఫామ్ అందజేశాక నేరుగా మాట్లాడనున్నట్లు తెలిసింది. అలాగే, అభ్యర్థుల సమక్షాన మేనిఫెస్టో వెల్లడించనున్నారు. ఆవెంటనే నియోజకవర్గాల్లో భారీ ఎత్తున సంబరాలు జరపాలన్న అధిష్టానం సూచనలతో ఆ దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ కార్డులను మించి తమ పథకాలు ఉంటాయని పార్టీనేతలు చెబుతున్నారు.

సీఎం సభలపై నజర్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నారు. తొలివిడతగా ఆయన పాల్గొనే సభల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు సభలు ఉన్నాయి. ఈనెల 27న పాలేరు, వచ్చేనెల 1న సత్తుపల్లి, ఇల్లెందు, 5న ఖమ్మం, కొత్తగూడెంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటారు. దీంతో వేదికలు ఖరారు చేసిన పార్టీ అభ్యర్థులు జన సమీకరణపై దృష్టి సారించారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి కూసుమంచి మండలం జీళ్లచెరువు సమీపాన, సత్తుపల్లి నియోజకవర్గంలో కల్లూరులోని షుగర్ ఫ్యాక్టరీ సమీపం మారుతీనగర్‌లో సీఎం సభ నిర్వహణకు ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య స్థలాలు ఖరారు చేశారు. అలాగే ఇల్లెందులోని జేకే మైదానం లేదా మహబూబాబాద్–కారేపల్లి రోడ్డులోని స్థలాన్ని సభ కోసం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వాన నేతలు పరిశీలిస్తున్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానాన్ని సభకు ఎంపిక చేయగా.. కొత్తగూడెంలో విశాలమైన స్థలంలో సభ నిర్వహించి భారీగా జన సమీకరణ చేయాలన్న ఆలోచనలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఉన్నారు.

జంగ్ తెలంగాణ

ఒక్కో ఓటర్‌ను మూడుసార్లు కలవాలి

- ప్రతీ డివిజన్‌లో పార్టీ కార్యాలయాలు
- నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశంలో మంత్రి పువ్వాడ


ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, కార్పొరేటర్లు ప్రతీ గడపకు వెళ్లి ఒక్కో ఓటరును కనీసం మూడు సార్లు కలిసి కారు గుర్తుకు ఓటు వేసేలా అభ్యర్థించాలని రాష్ట్ర మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం రోటరీనగర్‌లో శనివారం నియోజకవర్గ బూత్ స్థాయి విస్తత సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వాన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. అలాగే, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చేరవేయాలని చెప్పారు. ఈ నెలాఖరుకల్లా ప్రతీ డివిజన్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభించేలా కార్పొరేటర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నవంబర్ 5న ఖమ్మంలో జరిగే సీఎం కేసీఆర్ హాజరవుతారని, 10వ తేదీన తాను నామినేషన్ వేయనుండగా.. ప్రచారం చివరిలో మంత్రి కేటీఆర్ రోడ్డు షో ఉంటుందని మంత్రి పువ్వాడ తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త మానసికంగా సిద్ధమై క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, సుడా, మార్కెట్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, దోరెపల్లి శ్వేత, జెడ్పీటీసీ ప్రియాంకతో పాటు ఫాతిమా జోహరా, పగడాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

రెండు నదుల సంగమం!

- అటు కృష్ణా.. ఇటు గోదావరి!
- పాలేరుకు ఒకేసారి వస్తున్న జలాలు



పాలేరు రిజర్వాయర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు ఇన్నాళ్లు కృష్ణా జలాలే ఆధారం. కానీ ఇప్పుడు గోదావరి జలాలకు తోడు... సాగర్ నుండి కృష్ణా జలాలు వస్తుండడంతో రెండు నదుల నీరు ఒకేసారి చేరుతున్నట్లవుతుండగా.. నీటిమట్టం గణనీయంగా పెరుగుతోంది. జిల్లాలోని సాగర్ ఆయకట్టు కింద 2.5లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా వర్షాభావ పరిస్థితుల్లో సమృద్ధిగా నీరు అందడం లేదు. దీంతో రైతుల ఆందోళన మేరకు నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం సాగర్ జలాలను విడుదల చేసింది. ఈ నీరు రిజర్వాయర్‌కు చేరుతుండగా ఆయకట్టుకు విడుదల చేశారు.

అదనంగా గోదావరి జలాలు...

రిజర్వాయర్‌కు సాగర్ జలాలు వస్తున్నా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించే పరిస్థితి లేదు. దీంతో జలవనరుల శాఖ అధికారులు బయ్యన్నవాగు ప్రాజెక్టును శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటితో నింపి అలుగు పారిస్తున్నారు. అక్కడి నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా సుమారు 80 కి.మీ. మేర ప్రవహించి తిరుమలాయపాలెం మండలంలోని సోలిపురం వద్ద పాలేరు రిజర్వాయర్‌కు వచ్చే ఏటిలో కలుస్తోంది. అనంతరం పాలేరు రిజర్వాయర్‌కు వస్తుండగా.. దిగువకు 2,200 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. కాగా, పాలేరుకు 1,345 క్యూసెక్కుల గోదావరి జలాలు, సాగర్ నుండి 1,600 క్యూసెక్కుల కృష్ణా నీరు చేరుతుండగా రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులకు గాను శనివారం 20.01 అడుగులకు చేరింది.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం స్వామికి సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణం నిర్వహించారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు

ఖమ్మంరూరల్: ఎన్నికల నేపథ్యాన పోలీసులు మండలంలోని పల్లెగూడెం, నాయుడుపేట బైపాస్, వరంగల్ క్రాస్, కోదాడ క్రాస్ రోడ్లలో శనివారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. నగదు, బంగారం తరలిస్తున్నారా? అని ఆరా తీశారు. ఇదిలా ఉండగా కూసుమంచి నుంచి ఖమ్మం వెళ్తున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వాహనాన్ని కూడా కోదాడ క్రాస్ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఏసీపీ బస్వారెడ్డి, సీఐ రాజిరెడ్డి, ఎస్‌ఐ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అండర్-16 క్రికెట్ జట్టులో జిల్లా వాసులు


శ్రీకర్


మణికంఠ

రఘునాథపాలెం : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యాన ఎంపిక చేసిన అండర్-16 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు స్థానం దక్కింది. రఘునాథపాలెం మండలం వేపకుంట్లకు చెందిన పొట్టపల్లి నాగరాజు కుమారుడు మణికంఠ, రఘునాథపాలెం సీఐ కోటగిరి శ్రీధర్ కుమారుడు శ్రీకర్ వీరిలో ఉన్నారు. కాగా, మణికంఠ హైదరాబాద్‌లో, శ్రీకర్ ఖమ్మంలో పదో తరగతి చదువుతున్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఇద్దరు చొప్పున ఆరు జట్లకు గాను 66 మందిని ఎంపిక చేయగా, చివరకు రెండు జట్లుగా 24 మందిని ఎంపిక చేయనున్నారు.

టీఎస్‌డీఎఫ్ ప్యానల్‌ను గెలిపించాలి

ఖమ్మంవైద్యవిభాగం: తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో తమను గెలిపించాలని తెలంగాణ స్టేట్ డాక్టర్స్ ఫోరం(టీఎస్‌డీఎఫ్) ప్యానల్ అభ్యర్థులు పల్లం ప్రవీణ్, గట్టు శ్రీనివాసులు, ఆవుల మురళీధర్, గోంగూర వెంకటేశ్వర్లు కోరారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 46 వేల మంది రిజిస్టర్డ్ వైద్యులు ఉండగా.. వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుంటామని స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తాము టీఎస్‌డీఎఫ్ ప్యానల్ ద్వారా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. 2007 తర్వాత ఇప్పుడే ఎన్నికలు జరుగుతున్నందున తమ ప్యానల్‌లోని 13 మందిని గెలిపించాలని కోరారు. ప్రభుత్వం, వైద్యుల నడుమ వారధిలా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వైద్యులపై దాడులను అరికట్టేలా చూస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలదీయండి

ఖమ్మంమయూరిసెంటర్: నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోకుండా ధైర్యంగా ఉంటూ ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఎన్నికల్లో పోటీకి దిగిన బీఆర్‌ఎస్ అభ్యర్థులను నిలదీయాలని పీడబ్ల్యూ, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు సీహెచ్.శిరోమణి, ఎస్.ఆజాద్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లిక మృతికి సంతాప సూచకంగానే కాక టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలనే డిమాండ్‌తో పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఖమ్మంలోని గ్రంథాలయ సంస్థ నుంచి రాపర్తినగర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరితే కేసీఆర్ ప్రభుత్వం లాఠీచార్జ్ చేయించిందని ఆరోపించారు. ఈ మేరకు రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు గుణపాఠం చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధం కావాలన్నారు. కాగా, ర్యాలీని పోలీసులు డీఆర్‌డీఏ వద్ద అడ్డుకోగా కాసేపు వాగ్వాదం జరిగింది. నాయకులు ఝాన్సీ, మంగతాయి, శోభారాణి, భరత్, ధరణి, రవీందర్, పృథ్వీ, రమేశ్, వెంకట్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తల్లాడ: తల్లాడలో శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తల్లాడ మండల నారాయణపురానికి చెందిన పాట్టేటి మోహన్‌రెడ్డి(58) టీవీఎస్ ఎక్సెల్‌పై తల్లాడకు వచ్చి సరుకులు కొనుగోలు చేసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న బస్సు ఆయనను ఢీకొట్టింది. ఈఘటనలో మోహన్‌రెడ్డి తల, ఇతర భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో నారాయణపురం లూర్థుమాత ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు.

తల్లంపాడు వద్ద...

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఖమ్మం నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఖమ్మంవైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని శనివారం రాత్రి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతున్న యువకుడు...

కల్లూరు: ప్రేమించిన యువతి దక్కుతుందో, లేదోనన్న మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పేరువంచకు చెందిన గొల్లమందల పవన్‌కల్యాణ్(25) ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఆమెను వివాహం చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పగా ఆలోచిద్దామని అన్నారు. దీంతో ఆయన నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగడంతో కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే శనివారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘు తెలిపారు.

లీకేజీలకు కేరాఫ్‌గా టీఎస్‌పీఎస్‌సీ

- ప్రశ్నాపత్రాల లీకేజీ వెనుక కుంభకోణం
- సడక్‌బంద్‌లో అఖిలపక్షం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగాల భర్తీ కోసం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాల్సిన టీఎస్‌పీఎస్‌సీ లీకేజీలకు కేరాఫ్‌గా మారినందున పూర్తిగా ప్రక్షాళన చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలకు కా రణమైన వారిపై చర్యలు తీసుకోవడమే కాక నష్టపోయిన విద్యార్థులకు రూ.3లక్షల పరిహారం చెల్లించాలనే డిమాండ్ తో అఖిలపక్షం ఆధ్వర్యాన ఖమ్మం బైపాస్ రోడ్‌లో శనివా రం సడక్‌బంద్ నిర్వహించారు. నాయకులు రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈసందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, ప్రజాపంథా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి తెలంగాణను సాధించుకుంటే వాటిని నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాగా, పశ్నపత్రాల లీకేజీల వెనుక ప్రభుత్వ వైఫల్యానికి తోడు కుంభకోణం దాగి ఉందని తెలిపారు. ఈ మేరకు నాయకులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు యత్నించగా ఉద్రిక్తత నెలకొంది. చివరకు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఆవుల అశోక్, జి.రామయ్య, యడ్లపల్లి సతీశ్, యర్రా బాబు, జానీమియా, ఏపూరి లతాదేవి, కొండవర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, పి.కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు రమణ, పుల్లయ్య, ఆవుల మంగతాయి, శిరోమణి, ఝాన్సీ, రాయల నాగేశ్వరరావు, సైదులు పాల్గొన్నారు.


ఖమ్మం మయూరిసెంటర్ : రహదారిపై బైఠాయించిన అఖిలపక్ష పార్టీల నాయకులు


తిరుమలాయపాలెం : సడక్‌బంద్‌లో పాల్గొన్న నాయకులు

తిరుమలాయపాలెంలో...

తిరుమలాయపాలెం: ఉద్యోగ నియామకాల్లో వైఫల్యాలను నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యాన తిరుమయపాలెం మండల కేంద్రంలో సడక్‌బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా నాయకులు పాల్గొనగా పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌తోపాటు చావా శివరామకృష్ణ, కొమ్ము శ్రీను, రాధాకృష్ణ, హన్మంతరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

107 బతుకమ్మలతో భారత్ ఆకృతి

ఏషియన్ గేమ్స్‌లో విజేతలకు అభినందన


భారతదేశం ఆకృతిలో 107 బతుకమ్మలు అమర్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

తల్లాడ: తల్లాడలోని కేఎస్‌ఎం జూనియర్ కళాశాల, బాలభారతి విద్యాలయం ఆధ్వర్యాన శనివారం బతుకమ్మ సంబురాలను వినూత్న రీతిలో నిర్వహించారు. ఇటీవల జరిగిన ఏషియన్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు 107 పతకాలు సాధించగా.. అంతే సంఖ్యలో బతుకమ్మలను పేర్చారు. వీటిని భారతదేశ ఆకృతిలో ఏర్పాటుచేసి ఆటపాటలతో సందడి చేశారు. కేఎస్‌ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూల పండుగలో మంత్రి, ఎంపీ


ఫ్రీడమ్ పార్క్ వద్ద బతుకమ్మ సంబరాల్లో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంలోని ఫ్రీడమ్ పార్క్, పర్ణశాల వద్ద శనివారం జరిగిన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలకు శుభాకాంక్షలు తెలిపి కాసేపు వారితో బతుకమ్మ ఆడారు. ఇక 51వ డివిజన్‌లో శనివారం జరిగిన ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర - విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళలతో ఆడిపాడారు. మేయర్ పి.నీరజతో పాటు కార్పొరేటర్లు పగడాల శ్రీవిద్యనాగరాజు, శీలంశెట్టి రమా వీరభద్రం, చావా మాధురి నారాయణరావు, కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మంమయూరిసెంటర్


బతుకమ్మ ఆడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దంపతులు


పర్ణశాల వద్ద వేడుకల్లో మంత్రి పువ్వాడ, మేయర్ నీరజ తదితరులు

తనిఖీల్లో రూ.11.35లక్షలు స్వాధీనం

పెనుబల్లి: ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో పోలీసుల విస్తృత తనిఖీలు చేపడుతుండగా భారీగా నగదు పట్టుబడుతోంది. ఈమేరకు పెనుబల్లి మండలంలోని ముత్తగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఎస్సై జి. సూరజ్ తన సిబ్బందితో శనివారం రాత్రి వాహనాలు చేపట్టారు. ఈమేరకు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామానికి చెందిన రాచూరి చంద్రశేఖర్‌రావు తిరువూరు వైపు నుండి చిత్తూరు వైపు కారులో వెళ్తుండగా పరిశీలించారు. ఈసందర్భంగా కారులో రూ.2.30లక్షల నగదు లభించగా, చంద్రశేఖర్‌రావు వద్ద ప్రతాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై సూరజ్ తెలిపారు.

జిల్లా కేంద్రంలో రూ.5.83లక్షలు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని త్రీటౌన్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు రూ.5.83లక్షల నగదు సీజ్ చేశారు. సీఐ సత్యనారాయణ ఆధ్వర్యాన ట్రంక్ రోడ్ సమీపంలో సోదా చేస్తుండగా ఓ మెడికల్ డిస్ట్రిబ్యూటర్‌కు చెందిన వ్యక్తులు ద్విచక్రవాహనంపై రూ.4లక్షలు తీసుకెళ్తుండగా గుర్తించారు. అలాగే, మరో వ్యాపారి వద్ద రూ.1.83లక్షలు లభ్యమయ్యాయి. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సత్తుపల్లి మండలంలో రూ.2.09 లక్షలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని తెలంగాణ సరిహద్దు మేడిశెట్టివారిపాలెంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారులో ఎలాంటి పత్రాలు లేకుండా రూ.83 వేలు నగదు తరలిస్తుండగా సీజ్ చేశారు. అలాగే, విశాఖపట్నం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఇంకో కారు నుంచి రూ.1.26 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు, ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్, సిబ్బంది సతీశ్, నరేశ్, జగదీశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఖమ్మంలో నగదుసీజ్ చేస్తున్న సీఐ సత్యనారాయణ

వేంసూరులో రూ.లక్ష..

వేంసూరు: వేంసూరు మండలం వెంకటాపురం చెక్ పోస్టు వద్ద పోలీసులు శనివారం రూ.1,16,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏపీ సరిహద్దు వెంకటాపురం చెక్ పోస్టు వద్ద ఎస్‌ఐ వీరప్రసాద్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేకుండా కారులో ఏపీ నుంచి తెలంగాణకు తీసుకొస్తున్న నగదును స్వాధీనం చేసున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రూ.5 వేల విలువైన మద్యం స్వాధీనం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక క్రాస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో పోలీసులు రూ.5వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీధర్, ఎస్‌ఐ బి.కొండల్‌రావు ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా.. హరియాతండాకు చెందిన దుర్గి అరుణ ఖమ్మంలో కొనుగోలు చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దూషించిన ఐదుగురిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని దారేడుకు చెందిన ఐదుగురిపై శనివారం రాత్రి ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ గ్రామానికి చెందిన పుచ్చకాయల కమలాకర్, బత్తిని సీతారాములు, చాగంటి అశ్వత్థామ, నూర్ సామాషుద్దీన్, షేక్ జిలానీ ఎలాంటి అనుమతి లేకుండా సమావేశం నిర్వహించి ఇతరులపై వ్యక్తిగత దూషణలు చేశారు. ఈ విషయమై అధికారులు వీడియో ఆధారంగా విచారణ చేపట్టడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిని బలితీసుకున్న ఆన్‌లైన్ బెట్టింగ్

అప్పులు ఎక్కువై ఆత్మహత్య


దేవకుమార్ (ఫైల్)

తిరుమలాయపాలెం: ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లతో అప్పుల పాలైన ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని బచ్చోడుకు చెందిన ఎన్నెబోయిన వెంకన్న, ఉప్పమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు దేవకుమార్ (23) ఉండగా.. కుమారుడు అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి ప్రస్తుతం కాకరవాయిలోని ఓ మందుల షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు పాల్పడే ఆయనకు అప్పులు పెరగగా తండ్రికి తెలిసి మందలించాడు. అయినా బెట్టింగ్‌లో పాల్గొన్న ఆయన డబ్బు కోల్పోయాడు. దీంతో అప్పులు తీర్చలేక మూడు రోజుల నుంచి షాపునకు వెళ్లని దేవకుమార్.. శుక్రవారం బచ్చోడుతండా సమీపంలోని తానంచర్ల కాల్వ వద్ద గడ్డి మందు తాగి పడిపోయాడు. ఆయనే విషయాన్ని స్నేహితులకు ఫోన్‌లో చెప్పగా కుటుంబీకులు చేరుకుని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సెల్‌ఫోన్ లాక్ రాకపోవడంతో పూర్తిసమాచారం తెలియకపోగా, కుటుంబీకులు మాత్రం అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


బాషా (ఫైల్)

తిరుమలాయపాలెం: ఓ మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తికి మనస్పర్థలు రావడంతో ఎలుకల మందు తాగగా ఈ నెల 6న మహిళ మృతి చెందింది. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశాడు. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన షేక్ బాషా(36)కు వివాహమై పిల్లలు ఉన్నారు. దమ్మాయిగూడెంకు చెందిన ఆయన సమీప బంధువు అయిన వివాహి తతో ఖమ్మంలో ఉంటూ ఆయన సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరి నడుమ వివాదం జరగడంతో ఇద్దరూ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ నెల 6న మహిళ మృతి చెందగా బాషా శనివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పిండిప్రోలు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, ఈ వివాహేతర సంబంధం రెండు కుటుంబాల్లో విషాదం నింపినట్లయింది.

కోళ్ల పందేల స్థావరంపై దాడులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం గోపాలపురంలోని కొబ్బరితోటలో కోళ్ల పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకొని రెండు పందెం కోళ్లు, కత్తులు, రూ.11వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం అర్బన్ ఎస్‌ఐ వీరేందర్ తెలిపారు. కాగా, మరో ముగ్గురు పరారయ్యారని పేర్కొన్నారు.

ఎన్నికల్లో పోటీకి ప్రజాపంథా కసరత్తు

- బుర్జువా పార్టీలను వదిలోస్తే వామపక్షాలతో కలిసేలా ఆలోచన

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కసరత్తు ప్రారంభించింది. పార్టీ రాష్ట్ర కార్యవర్గం సమావేశాలు ఖమ్మంలో జరుగుతుండగా, రాజకీయపరమైన అంశాలపై అగ్రనాయకత్వం చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకైతే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగాలని నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో 15కు పైగా స్థానాల్లో పోటీ చేయడంపై చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. కాగా, వామపక్ష పార్టీలైన సీపీఎం, సీపీఐలు బూర్జువా పార్టీలతో కాకుండా బరిలో దిగితే తాము కూడా కలిసేలా చర్చలు జరపాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కనీసం నాలుగు స్థానాల్లో పోటీ చేయాలనే అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం.

ప్రవల్లిక మృతికి ప్రభుత్వానిదే బాధ్యత


ఖమ్మంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఉద్యోగ భర్తీ పరీక్షల నిర్వహణలో లోపాలతో హైదరాబాద్‌లో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకోగా.. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయం నుంచి మయూరిసెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడగా నాయకులు మహ్మద్ జావేద్‌తో పాటు తుంబూరు దయాకర్‌రెడ్డి, దొబ్బల సౌజన్య, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, ఏలూరి రవి, ఎడ్లపల్లి సంతోష్, పాలకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

నేలకొండపల్లి/కామేపల్లి: నిరుద్యోగ అభ్యర్థి ప్రవల్లిక మృతికి సంతాపంగా నేలకొండపల్లి, కామేపల్లి మండలం కొత్తలింగాల ఎస్సీకాలనీల్లో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు జెర్రిపోతుల అంజిని, గింజల నర్సింహారెడ్డితోపాటు నెల్లూరి భద్రయ్య, చింతనిప్పు సైదులు, జెర్రిపోతుల సత్యనారాయణ, అనంతు సత్యం, యడవల్లి హుస్సేన్‌గౌడ్, కడియాల నరేశ్, యడవల్లి నాగరాజు, భూక్యా రవి, యాకోబ్, వీరబాబు, సాయినవీన్,తాతా అఖిల్, భరత్, సాయి, నల్లమోతు లక్ష్మయ్య, దేవండ్ల రామకృష్ణ, చల్ల మల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, నల్లమోతు వెంకటనర్సయ్య, అజ్మీరా అర్జున్, భూక్యా బాలునాయక్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.